క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



కేకే రాజు, దేవన్‌రెడ్డితో గాజువాక నియోజకవర్గ నాయకులు

గాజువాక: నియోజకవర్గానికి సంబంధించి ఇటీవల పదవులు పొందిన నాయకులు పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. వార్డుల్లో పార్టీని బలోపేతం చేసే విధంగా పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుండాలన్నారు.

154 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గాజువాక: తుంగ్లాం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సత్య శ్రీనివాసం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది 154 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి 32 మందికి శస్త్ర చికిత్సలను సిఫార్సు చేశారు. వారికి సోమవారం ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిత్యకల్యాణం ఉదయం 9:30 గంటల నుంచి వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ అత్యంత విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి, విశేషంగా హారతి సమర్పించారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

పరిసరాల పరిశుభ్రతతో పర్యావరణ పరిరక్షణ



సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర'మూడో శనివారం కార్యక్రమం జరిగింది. సీఈవో పి.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛత ఆవశ్యకత, పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్, పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏపీపీ ఆర్ఎంఈఏ అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఏపీఎస్ జీవో జాయింట్ సెక్రటరీ ఎ.మదన్‌మోహన్, పరిపాలనాధికారులు మంజులవాణి, ఎం.నరసింహమూర్తి, పి.వి.వి.ఎస్.మూర్తి, రాజేశ్వరి, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, పంచాయితీరాజ్ అధికారులు, సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియా!

- యథేచ్ఛగా తవ్వకాలు
- లారీలు, ట్రాక్టర్లలో తరలింపు
- కన్నెత్తి కూడా చూడని అధికారులు



అక్రమంగా తవ్విన మట్టిని తరలిస్తున్న లారీ



చినపాలెం శ్మశానవాటిక వద్ద మట్టితవ్వకాలు

పెదగంట్యాడ: మట్టి బంగారమయింది.. కాసుల పంట పండిస్తోంది.. దీంతో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తోంది.. జీవీఎంసీ 77వ పరిధిలోని దేవాడ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఈ దందా సాగుతోంది. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

వార్డు పరిధిలో వక్ఫ్‌బోర్డ్‌కు చెందిన భూములు ఉన్నాయి. అయితే వార్డుకు చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడ్డారు. ఉదయం, మధ్యాహ్నం.. సాయంత్రం.. రాత్రి అనే తేడా లేకుండా పొక్లెయిన్‌తో మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లు, లారీల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

దేవాడ దరి పెదపాలెం, చినపాలెం, ఇస్లాంపేట, మదీనాబాగ్ తదితర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దందా సాగిస్తున్నారు. నిత్యం ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున మట్టితవ్వేస్తున్నారు. వక్ఫ్ బోర్డ్‌తో పాటు స్టీల్‌ప్లాంట్‌కు చెందిన స్థలాల్లోనూ జేసీబీల సాయంతో తవ్వకాలు జరిపి చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లోని లే అవుట్లు, ఇళ్ల పునాదుల ఫిల్లింగులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ముందుగానే ఒప్పందం

ముందుగా మట్టిఅవసరమైన వారితో ఒప్పందం చేసుకుంటున్నారు. ట్రాక్టర్‌కి రూ.2000, లారీకి రూ. 3 వేల నుంచి రూ. 4 వేల వంతున ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. పబ్లిక్ హాలీడేల్లో 24 గంటలూ, మిగిలిన రోజుల్లో రాత్రి వేళల్లో మట్టి తవ్వేస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడే మట్టిని తవ్వేయడంతో అక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఈ గోతులు కాస్తా ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మూగ జీవాలు ఆ గోతుల్లో పడి బయటకు రాలేక మృత్యువాత పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. పెదపాలెం, చినపాలెం సమీపంలో కొన్ని ప్రాంతాల్లో చెరువులను తలపించే గొయ్యిలు ఏర్పడ్డాయి. ఇక్కడ ఇంత తంతు జరుగుతున్నా రెవెన్యూ, వక్ఫ్‌బోర్డ్, స్టీల్‌ప్లాంట్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు ఫిర్యాదులు అందినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కానరాని భూముల పరిరక్షణ చర్యలు

ఇక్కడ ఎంతో విలువైన వక్ఫ్‌బోర్డు భూములున్నా వాటిని పరిరక్షించే అధికారులు కనిపించడం లేదని చెబుతున్నారు. వక్ఫ్‌బోర్డు స్థలాలను కొంతమంది ఆక్రమించుకొని భారీగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నిద్రనటిస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు చుట్టపుచూపుగా వచ్చి వెళ్లిపోతున్నారని.. ఆక్రమణదారులు మట్టి మాఫియా జోలికి వెళ్లిన దాఖలాలు కనిపించడం లేదని బహిరంగంగా ఈ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే ఇక్కడ భూములన్నీ గోతుల మయం కావడం ఖాయమని అంటున్నారు.



ఇస్లాంపేట పెట్రోల్ బంక్ ఎదురుగా ప్రమాదకరంగా గొయ్యి

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరిస్తున్న వార్డు అధ్యక్షులు

పెదగంట్యాడ: ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పలదేవన్ రెడ్డి సూచించారు. ఆ పార్టీ వార్డు అధ్యక్షులుగా నియమితులైన వారు శనివారం నాగిరెడ్డి, దేవన్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. వారిని కలిసిన వారిలో 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు, 65వ వార్డు అధ్యక్షుడు మద్దాల అప్పారావు, 66వ వార్డు అధ్యక్షుడు పెదిరెడ్ల ఈశ్వరరావు, 67వ వార్డు అధ్యక్షుడు పల్లా సురేష్ యాదవ్, 68వ వార్డు అధ్యక్షుడు సంద్ర సూకరాజు, 69వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, 70 వ వార్డు అధ్యక్షుడు కొణతాల రాము.71వ వార్డు అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాసరాజు, 73వ వార్డు అధ్యక్షుడు షౌకత్ అలీ, 74వ వార్డు అధ్యక్షురాలు తిప్పల ఎమిలీ జ్వాల, 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి, 76వ వార్డు అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ, 78వ వార్డు అధ్యక్షుడు రావాడ శివ, 79వ వార్డు అధ్యక్షుడు మహాలక్ష్మి నాయుడు, 85వ వార్డు అధ్యక్షుడు గునటి పూర్ణనంద శర్మ ఉన్నారు. నాయకులు ఎండీ గౌస్, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర పారాయణం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విష్ణుసహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఏకాదశి సందర్భంగా ఉదయం ఆలయ ప్రాంగణంలో భక్తులు విష్ణునామం జపించారు. అంతకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్న భక్తులు

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ జాబితా అందజేత



హెచ్‌ఆర్ విభాగాధిపతి మధుసూదనరావుకు జాబితా అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు నూతన కార్యవర్గం జాబితాను ఉక్కు యాజమాన్యానికి అందజేశారు. ఉక్కు పరిపాలన భవనంలో శనివారం స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం. మధుసూదనరావును కలిసి నియామకపు పత్రాలు అందజేశారు. అధ్యక్షుడు కర్రి దాలినాయుడు, ప్రధానకార్యదర్శి డి.వి. రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. పుల్లారావు, ఆర్గనైజింగ్ అధ్యక్షులు పేర్ల సూకరాజు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బోడెం రాజు, ఉపాధ్యక్షులు గోరంట్ల సూర్యనారాయణ, దామూర్తి అప్పలరాజులను జీఎంకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఉక్కు కార్మికులకు హెచ్‌ఆర్ఏ పునరుద్ధరించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని , లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పునరుద్ధరించాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దూడ త్రినాథరెడ్డి, నమ్మి ప్రసాద్, చిత్రాడ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

కూర్మన్నపాలెం: ఓ పేదవిద్యార్థికి వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఆర్థిక సాయం అందించారు. పద్మశాలి వీధికి చెందిన పార్టీ కార్యకర్త కాకి రమాదేవి కుమారుడు స్థానిక పాఠశాలలో చదువుతున్నాడు. అయితే పుస్తకాలు, ఫీజులు చెల్లించడానికి తగిన ఆర్థిక స్థోమత లేక పోవడంతో కొంత మంది నాయకలు దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో 87 వ వార్డు నాయకుడు ఇల్లపు రాము స్పందించి ఆర్థికంగా ఆదుకోవడానికి ముందుకు వచ్చాడు. వార్డు నాయకులు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రగడ వేణు, దుగ్గపుదానప్పలు, నాగేశ్వరరావు, గుండు శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేపు నీటి సరఫరాకు అంతరాయం

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లోని సుందరయ్యకాలనీలో గల 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టు నీటి శుద్ధి కర్మాగారంలో పైప్‌లైన్లు, మోటార్లకు ఈనెల 23న మరమ్మతులతో పాటు చిన్నచిన్న మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు ఆ విభాగం సహాయ ఇంజినీర్ పి.కేదార్‌నాథ్ తెలిపారు. ఆ కారణంగా 70 నుంచి 74 వార్డులకు, 75, 64, 65 వార్డులకు సోమవారం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

యోగా.. ఉత్సాహంగా



వడ్లపూడిలో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

గాజువాక: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలు యశోధర వేదమణి న్యాయమూర్తులు, న్యాయవాదులతో యోగాసనాలు వేయించారు. యోగా సాధన చేయడం వల్ల లభించే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.షణ్ముఖరావు, ఎస్.కవిత, ఎం.వి.శేషమ్మ, యార్లగడ్డ శ్రీలక్ష్మి, వి.పల్లవి, అసోసియేషన్ కార్యదర్శి డి.చిరంజీవి, ప్రతినిధులు సత్యవాణి, కృష్ణ, గిల్బర్ట్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

టీఎస్సార్, టీబీకే కళాశాలలో విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. కళాశాల డైరెక్టర్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్ రావు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: ప్రపంచ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వడ్లపూడిలోని వివిధ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. డాలీ పాఠశాలలో చిన్నారులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. 87వ వార్డు తిరుమలనగర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సుమిత్ర, దీపా, రాజేష్, కాలనీ పెద్దలు పరమానందం, సన్యాసిరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



తిరుమలనగర్‌లో మొక్కలు నాటుతున్న కాలనీవాసులు



యోగా దినోత్సవంలో ప్రసంగిస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కుస్టేడియంలో..

ఉక్కునగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉక్కు స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. యోగా గురువులు ఎ. కనకరావు, ఎ. శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు పాండే, జి.వి. ప్రసాద్, సలీం జి పురుషోత్తం, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ కరుణ రాజు, హెచ్‌ఆర్ ఇన్‌చార్జి ఎం. మధుసూదనరావు, ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ సారంగితో పాటు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

కేంద్రీయ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, బాలబాలికలు యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న యారాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు



ఉక్కు స్టేడియంలో యోగా చేస్తున్న ఉద్యోగులు



ఉక్కు స్టేడియంలో యోగా చేస్తున్న ఉద్యోగులు



ఉక్కు కేంద్రీయ విద్యాలయంలో యోగా వేస్తున్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెదగంట్యాడ: యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యారాడ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల హెచ్ఎం ఎస్ అప్పారావు అన్నారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు అప్పారావు అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఎన్నాళ్లిలా?



చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు



మురుగు నీరు బయటకు పారేందుకు మార్గం లేని వెనుక భాగం

- 16 ఏళ్లుగా ప్రారంభానికి దూరం
- సౌకర్యాలు లేక నిరుపయోగం
- శిథిలమవుతున్న ప్రజా మరుగుదొడ్లు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధి యాతపాలెం గ్రామానికి ఆనుకొని నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని నిర్మించి సుమారు 16 ఏళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు వీటిని వినియోగించడం లేదు. మురుగునీరు బయటకు పారేందుకు మార్గం లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం పడితే చాలు ఈ ప్రాంతమంతా నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తున్నాయి. అప్పటి పాలకులు, నాయకులు ముందు చూపు లేకుండా గ్రామానికి ఆనుకుని నిర్మిండంతో పాటు సౌకర్యాలు కల్పించకపోవడంతో వినియోగానికి దూరంగా ఉన్నాయి. చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో విష పురుగులు చేరుతున్నాయి. వర్షం పడిన ప్పుడు, రాత్రి వేళల్లో ఇటువైపు రావాలంటే భయమేస్తోందని స్థానికులు చెబుతున్నారు. లక్షలు ఖర్చుచేసి వీటిని నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను ఇలా వదిలేయడం సరికాదని స్థానికులు వాపోతున్నారు. నీటి సదుపాయంతో పాటు మురుగునీరు బయటకు పోయేలా చర్యలు చేపట్టి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. లేదంటే పూర్తిగా తొలగించి, ఆ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం వంటివి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్



పాలిటెక్నిక్ కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది



గైస్‌లో విద్యార్థికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యోగాంధ్ర కార్యక్రమం ఉన్నప్పటికీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ , కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నానికి విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 7,501 నుంచి 15,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 296 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. వీరిలో 234 మంది బీసీ విద్యార్థులు, 44 మంది ఓసీలు, 17 మంది ఎస్సీలు, ఒకరు ఎస్టీ విద్యార్థి ఉన్నారు. వీరందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ పర్యవేక్షణలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. భాషా, లెక్చరర్ నాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం 23,501 నుంచి 32,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. ఇక్కడ 1 నుంచి 7,500 ర్యాంక్ వరకు గల విద్యార్థులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ అందించారు. ఆదివారం 15,001 నుంచి 23,500 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై శనివారం సాయంత్రం వాటర్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకటో వార్డు బాలాజీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నమ్మి రాము(28) దుర్మరణం చెందాడు. భీమిలి మండలం తాళ్లవలసలో ప్రయాణికులను దించి, ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్యాంకర్ బలంగా ఢీకొనడంతో తుక్కయిన ఆటోలోనే తీవ్ర రక్తగాయాలతో మృతుడు చిక్కుకుపోయాడు. స్థానికులు బయటకు తీసి సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి చికిత్సకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాముకు భార్య మంగమ్మ, ఇద్దరు కుమార్తెలు జ్యోత్స్న (6), నిత్య(4) ఉన్నారు. ప్రస్తుతం మంగమ్మ అయిదో నెల గర్భిణి. తండ్రి అప్పారావు గతంలో రిక్షా కార్మికుడిగా చేసేవారు, ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యారు. తల్లి అప్పయ్యమ్మ వెంకటేశ్వరమెట్ట వద్ద చిన్న టీ దుకాణం నిర్వహిస్తూ కుటంబానికి చేదోడు వాదోడుగా ఉంటోంది. భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో రాము కలిసే ఉండేవాడు. ఇంటి పెద్ద దిక్కు అయిన రాము మరణంతో ఆ కుటుంబం గుండెలవిసేలా రోదిస్తోంది. రాము మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ వాటర్ ట్యాంకర్ పేరు చెబితే టెర్రర్

కాలం చెల్లిన ఈ వాటర్ ట్యాంకర్‌ను చూస్తే రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి ఒక్కరికి దడే. ట్యాంకర్‌కు బీమా, బ్రేకులు, అద్దాలు, నంబర్ ప్లేట్ లేకపోయినా దర్జాగా రోడ్లపై తిరుగుతుంది. గోస్త నీనది వద్ద వ్యవసాయ మోటారు నుంచి 24 గంటలూ నీటిని తోడి సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించి, దీని యజమాని సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ ట్యాంకర్‌కు ఫిట్‌నెస్, బీమా, నంబరు ప్లేట్ లేకపోయినా భీమిలి పోలీసులు, రవాణా శాఖ అధికారులు కన్నెత్తి అయినా చూడడం లేదు. వీరి నిర్లక్ష్యం కారణంగా ఒక పేద ఆటో డ్రైవర్ బలైపోయాడని బాలాజీనగర్ వాసులు కంటతడి పెడుతున్నారు.



మృతుడు రాము



తుక్కయిన ఆటో